ప్రజాశక్తి
శుక్రవారం 18 ఆగస్టు 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గంగవరం.. రణరంగం



ఇనుప కంచె, బారికేడ్లను తోసుకుంటూ దూసుకొస్తున్న కార్మికులు

- అదానీ పోర్టు ముట్టడికి వేలాదిగా తరలివచ్చిన కార్మికులు
- ఇనుప కంచెలను దాటుకుంటూ ముందుకు..
- జీతాలు, ఇతర సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరిక
- తీవ్ర పోలీసు నిర్బంధం, లాఠీఛార్జి
- పలువురికి గాయాలు, సొమ్మసిల్లిపడిపోయిన మహిళలు

ప్రజాశక్తి - గాజువాక

జీతాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్, అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఆధ్వర్యాన గురువారం తలపెట్టిన 'చలో అదానీ గంగవరం పోర్టు' కార్యక్రమానికి వేలాదిగా కార్మికులు కుటుంబాలతో తరలివచ్చారు. పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించినా వెరవకుండా ఇనుప కంచెలను దాటుకుంటూ పోర్టు మెయిన్ గేటు వద్దకు దూసుకెళ్లారు. ఆద్యంతం తీవ్ర ఉద్రిక్తతల నడుమ పోర్టు ముట్టడి కార్యక్రమం సాగింది. పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ క్రమంలో కొందరు కార్మికులకు గాయాలయ్యాయి. మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సాగిన ఈ కార్యక్రమంలో అదానీ పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున కార్మికులు నినాదాలు చేశారు. తమ భూముల్లో పోర్టు కట్టి.. తమపైనే పెత్తనం ఏంటని మండిపడ్డారు. తొలుత పోర్టు కార్మికులు పెదగంట్యాడలోని మిగతా 2లో..



సొమ్మసిల్లి పడిపోయిన మహిళ



ధర్నాలో గంగారావు, పల్లా, చింతలపూడి, దేవన్ రెడ్డి

కార్మికులపై లాఠీఛార్జి దుర్మార్గం : సిపిఎం, సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఆందోళన చేస్తున్న అదానీ గంగవరం పోర్టు కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం లాఠీ ఛార్జీ చేయడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం కార్మికులపై నిర్బంధం నిలిపివేసి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కార్మిక చట్టాలను హరిస్తున్న అదానీ పోర్టు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు కోసం పేద మత్స్యకారులు తమ సముద్రపు వేట, మిగతా 2లో..

పోర్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

పోర్టు గేటు వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. అదానీ గంగవరం పోర్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, లేకపక్షంలో స్టీల్‌ప్లాంట్‌కైనా అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. పోర్టు నిర్మాణం కోసం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 1400 ఎకరాలను ఇచ్చారన్నారు. మత్స్యకారులు వారి భూములను, మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మాట్లాడరేం : సిపిఎం

వార్త మెయిన్‌లో..

ఉత్సాహంగా ఎపిఎల్ లీగ్ మ్యాచ్‌లు

వార్త మెయిన్‌లో..

మోడీ విధానాలు దుర్మార్గం

వార్త మెయిన్‌లో..

ఎపిపిఎస్‌సి, యుపిఎస్‌సి

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిపిఎస్‌సి, యుపిఎస్‌సి ద్వారా నగరంలో నిర్వహించబోతున్న పోటీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షలకు సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19, 21, 22 తేదీలలో నగరంలో నిర్వహించే ఎపిపిఎస్‌సి పోటీ పరీక్షలకు, 19, 20 తేదీలలో జరిగే యుపిఎస్‌సి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎపిపిఎస్‌సి నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షకు 5115 మంది, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్‌కు 530 మంది, శాంపిల్ టేకర్ పరీక్షకు 166 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టులలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం పరీక్షకు ఉదయం మిగతా 2లో..



మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

నగరంలో చల్లని గాలులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వరుస ఎండలు, ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు గురువారం సాయంత్రం నగరంలో వీచిన గాలులు, ఏర్పడిన చల్లదనంతో కాస్త ఉపశమనం లభించింది. వాస్తవానికి గురువారం కూడా ఎండలు 36 డిగ్రీలుగా రాష్ట్రంలోని పలు కేంద్రాల్లో నమోదయ్యాయి. నెల్లూరు, కావలిలో 37 డిగ్రీలను ఉష్ణోగ్రతలు తాకాయి. ఆగస్టు నెల సాధారణంగా రుతుపవనాల కాలం. విస్తారంగా వర్షాలు కురిసే సమయం. కానీ ఎండలు మండిపోతుండడంతో ప్రజానీకం తీవ్ర అసౌకర్యానికి గురౌతూ వస్తున్నారు. ఈ నెల 16న ఈశాన్య బంగాళాఖాతం, సరిహద్దు తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం గురువారం నాటికి వాయువ్య పరిసర ప్రాంతాల్లోకి విస్తరించిన కారణంగా రాగల 12 గంటల్లో అంటే గురువారం రాత్రి 12 గంటల నాటికి అల్పపీడనంగా ఇది బలపడనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కొద్దిచోట్ల రాగల రెండు రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని అమరావతి వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు పలుచోట్ల తేలికపాటి వర్షాలూ కురవనున్నాయి.

జెడ్‌పి సర్వసభ్య సమావేశం 22కు వాయిదా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22కు వాయిదా పడిందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.శ్రీరామ్మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 19న నిర్వహిస్తున్నట్లుగా తెలిపామని, పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఆరోజు కాకుండా మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

పార్కుల్లో ప్రవేశ రుసుము రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : రెసిడెన్షియల్ కాలనీల్లోని పార్కులలో ప్రవేశ రుసుము వసూలు చెయ్యాలని ఇటీవల జివిఎంసి కమిషనర్ చేసిన సూచనను వార్వా, నివాస్ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి గురువారం మిగతా 2లో..

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్, నర్సింగ్, పారామెడికల్, సహాయక సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలు చేపడుతున్న అశోక్ కుమార్

మొదటి పేజీ తరువాయి..

గంగవరం.. రణరంగం

తమ దీక్షా శిబిరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోర్టుకు మహా ప్రదర్శనగా బయలుదేరారు. పోలీసులు ఆ మార్గంలో మూడు చోట్ల ఇనుప కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అడ్డుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. అవేవీ కార్మికుల పోరును ఆపలేకపోయాయి. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, నాయకులు కొవిరి అప్పలరాజు, వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద కార్మికులకు మద్దతు తెలిపి వారిని ముందుకు నడిపించారు. జీతాలైనా పెంచండి.. మా సముద్రాన్నైనా మాకు ఇచ్చేయండి అని కార్మికులు డిమాండ్ చేశారు. మెయిన్ గేటు వద్ద జరిగిన ధర్నాకు మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య మద్దతు తెలిపి మాట్లాడారు.

ఆర్‌డిఒ చర్చలు

తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేయడంతో అక్కడకు ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ చేరుకున్నారు. నాయకులతో మాట్లాడిన అనంతరం ఆయన పోర్టు యాజమాన్యంతోనూ చర్చించారు. అదానీ పోర్టు యాజమాన్యం కొన్ని సమస్యలను పరిష్కరిస్తుందంటూ ఆయన చెప్పుకురాగా కార్మికులు సంతృప్తి చెందలేదు. అవసరమైతే గేటును బద్దలు కొట్టుకుని లోపలకు వెళ్తామని నినదించారు. ఆర్‌డిఒ స్పందిస్తూ సమస్యలను వినతిపత్రం రూపంలో తనకు ఇవ్వాలని కోరగా కార్మికులు అలాగే చేశారు. వాటిపై పోర్టు యాజమాన్యం నాలుగు రోజుల సమయం కావాలని అడిగింది. దీంతో కార్మికులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. గడువులోగా సమస్యలను పరిష్కరించకుంటే మళ్లీ పోర్టును ముట్టడిస్తామని హెచ్చరించారు.

పోర్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

ఇళ్లను, సముద్రాన్ని కోల్పోయారన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 45 రోజులుగా పోర్టు కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి అండతో అదానీ పోర్టు యాజమాన్యం రెచ్చిపోతోందన్నారు. విశాఖ పోర్టులోని కార్మికులకు కనీస వేతనం కింద రూ.36 వేలు అమలు చేస్తుంటే.. గంగవరం పోర్టులో దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులు కన్నెర్రజేస్తే అదానీ తట్టాబుట్టా సర్దుకుని గుజరాత్ పోవాల్సిందేనని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇచ్చిన గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. వైసిపి గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడుతూ గంగవరం మత్స్యకారులు, కార్మికులు సహనంతో ఇంతవరకూ ఉన్నారని, లేకుంటే పరిస్థితి వేరేలా ఉండేదని చెప్పారు. జనసేన కార్పొరేటర్ దల్లి గోవింద్ రెడ్డి మాట్లాడుతూ అదానీ యాజమాన్యం మొండివైఖరి వీడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై లాఠీఛార్జి దుర్మార్గం : సిపిఎం, సిఐటియు

ఉపాధిని, ఆస్తులను కోల్పోయారన్నారు. యాజమాన్యం వీరిని మోసగించి, ప్రాధాన్యత లేని పనుల్లో నియమించి కార్మిక చట్టాలను కాలరాసి శ్రమ దోపిడీ చేస్తోందన్నారు. కార్మికులను, యూనియన్ నాయకులను వేధిస్తోందని తెలిపారు. ఇలాంటి తరుణంలో న్యాయం కోసం పోరాడుతున్న కార్మికులపై నిర్బంధం ఎందుకు ప్రయోగిస్తున్నారని, మీకు అదానీ కావాలా ? సంపద సృష్టిస్తున్న కార్మికులు కావాలా ? అని జగ్గు నాయుడు ప్రశ్నించారు. కార్మికులకు ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందన్నారు. కార్మికులపై లాఠీఛార్జీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ వేరొక ప్రకటనలో ఖండించారు.

స్టేడియాలను జివిఎంసియే నిర్వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో ఉన్న స్వర్ణభారతి స్టేడియం, ఇతర ప్రాంతాల్లో ఉన్న స్టేడియాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే నిలుపుదల చేయాలని, స్టేడియాలన్నింటినీ జివిఎంసియే నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఎంవిపిలో ఉన్న స్పోర్ట్స్ ఎరీనా స్టేడియాన్ని రూ.27 కోట్ల ప్రజాధనంతో నిర్మించి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడంపై తమ పార్టీ పలుమార్లు నిరసనలు చేపట్టిందన్నారు. జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు నిరసన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. స్టేడియాల్లో శిక్షణ పొందిన వారు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన విషయాన్ని వివరించారు. గాజువాక, మధురవాడ వంటి ప్రాంతాల్లో 16 వరకు చిన్నపాటి మైదానాలు, స్టేడియాలు ఉన్నాయన్నారు. బీచ్‌లో స్విమ్మింగ్ పూల్ ఉందన్నారు. వీటన్నింటిలో జివిఎంసికి నామమాత్రపు ధరలు చెల్లించి శిక్షణ పొందుతున్నారన్నారు. ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళితే డబ్బున్న వారు తప్ప పేద, మధ్య తరగతి ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే స్టేడియాల ప్రైవేటీకరణ ఆలోచనలు విరమించుకోవాలని, లేని పక్షంలో ప్రజలను, క్రీడాకారులను సమీకరించి ఆందోళన చేపడతామని జివిఎంసి పాలకవర్గాన్ని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 32 మంది ప్రాణత్యాగంతో ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడుకుంటామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారానికి 868వ రోజుకు చేరాయి. దీక్షల్లో డివైఎఫ్ఐ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

పవర్ జెఎసి ఒప్పందంతో కార్మికులకు తీరని అన్యాయం

కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల ఆశలపై నీళ్లు చల్లుతూ పవర్ జెఎసి యాజమాన్యంతో యాజమాన్యం చేసుకున్న చీకటి ఒప్పందాన్ని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. గురువారం ఎలక్ట్రికల్ ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. ఆర్.సత్యారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి..) 8 గంటల నుంచి 9 గంటలలోపు, అదేవిధంగా మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 2 గంటలలోపు పరీక్షా కేంద్రాల లోపలకు కచ్చితంగా చేరుకోవాలని అన్నారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితిల్లోనూ లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్, స్మార్ట్ వాచెస్, ఇతర స్మార్ట్ పరికరాలను తీసుకురాకూడదని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆదేశించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 19, 20 తేదీలలో యుపిఎస్‌సి నిర్వహించబోతున్న కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రెండు షిఫ్టులలో జరుగుతాయన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 1632 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరి కోసం నగరంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.వెంకటరావు, సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఎఎస్ఒ పద్మ ప్రియ, యుపిఎస్‌సి అధికారులు, జివిఎంసి, పోలీస్, మెడికల్, ఇపిడిసిఎల్, ఆర్‌టిసి, వివిధ కాలేజీల లైజనింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


పార్కుల్లో ప్రవేశ రుసుము రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి..) ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పార్కుల నిర్వాహక సంఘాల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పార్కుల నిర్వహణకు నిధులను నిర్వాహకులే సమీకరించుకోవాలని, ప్రవేశ రుసుము వసూలు చెయ్యాలని చెప్పడం చాలా అన్యాయమన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తూ, ఆట పాటలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, ప్రజల మధ్య స్నేహ సుహృద్భావ సంబంధాలు నెలకొనడానికి నివాస కాలనీలలో పార్కులు ఎంతో అవసరమన్నారు. పార్కుల నిర్వహణ మున్సిపల్ కౌన్సిల్ బాధ్యతలలో ఒక ముఖ్యమైన కర్తవ్యమని గుర్తుచేశారు.

ప్రజా సమస్యలను వివరించేందుకే బస్సు యాత్ర

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి -గాజువాక : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలక వర్గాల దృష్టికి తీసుకెళ్లడమే బస్సు యాత్ర ప్రధాన లక్ష్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా గాజువాక లయన్స్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ప్రారంభమైన బస్సు యాత్ర రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తిరుగుతూ సెప్టెంబర్ 8 తిరుపతిలో ముగుస్తుందని తెలిపారు. బస్సు యాత్ర సందర్భంగా పలు జిల్లాలో ప్రజల సమస్యలపై సదస్సులు, సభలు, సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై శ్రీకాకుళంలో సదస్సు నిర్వహిస్తామని, గిరిజనుల సమస్యలపై పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులలో సభలు నిర్వహిస్తామని తెలిపారు. 'రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో బస్సు యాత్ర కొనసాగించి ప్రజా పోరాటాలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, యువకులు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొడుతూ, ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నరేంద్ర మోడీ తన అనుయాయులకు కట్టబెట్టేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పోరాటాల ద్వారా ఉక్కును కాపాడు కుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, సిపిఐ జివిఎంసి ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్, సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, ఎళ్ళేటి శ్రీనివాస్, అప్పారి విష్ణుమూర్తి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

జ్యూట్ కార్మికులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులందరికీ పరిహారం పూర్తిగా చెల్లించాలని యాజమాన్య ప్రతినిధిని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో యాజమాన్య ప్రతినిధి జెసిఎల్.రామారావు, మిల్లులోని 4 కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, రెండేళ్ల నుంచి ఇవ్వాల్సిన పిఎఫ్ సొమ్ము చెల్లించాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చెల్లించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విజయ దశమి నాటికి బకాయిలు చెల్లించాలని యాజమాన్యానికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ నుంచి చిల్ల రమణ, జీరు వెంకటరెడ్డి, కాకాస నుంచి జి.అప్పారావు, దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, ఎఐటియుసి ప్రతినిధులు కొండపు ఈశ్వరరావు, అల్లు బాబూరావు, టిఎన్‌టియుసి నాయకులు ఎస్.అచ్చారావు, ఎంవి.గురుమూర్తి, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

సిసి రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి నేరెళ్ళవలస కాలనీలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

తాటితూరు పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ఫీవర్, ఎన్‌సిడి సర్వే, ఇహెచ్‌ఆర్, ఒపి రిజిష్టర్‌ను పరిశీలించారు. గర్భిణిలకు టిటి ఇవ్వాలని, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎబి.మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఐ హాస్పిటల్ ఆధ్వర్యాన తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, సేవా దృక్పథంతో వైద్య సేవలు అందిస్తున్న విశాఖ ఐ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఐ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, టిడిపి నాయకులు మద్దిల రాజశేఖర్, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, దువ్వి తాతారావు, ఆనంద్, గొలుసు రమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాత్రికేయునిపై దాడి హేయం

ప్రజాశక్తి - ఆరిలోవ : పాత్రికేయునిపై దాడి చేసిన వారి పట్ల చర్యలు తీసుకోవాలని కోరుతూ చినగదిలి తహశీల్దార్ సనపల రమణయ్యకు ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 15న టిడిపి ఆధ్వర్యాన ఆర్‌కె బీచ్ వద్ద నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడుతుండగా విధుల్లో ఉన్న ప్రముఖ టీవీ ఛానల్‌కు చెందిన ఆరిలోవ రిపోర్టర్ సురేష్‌పై కొందరు టిడిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని తెలిపారు. రిపోర్టర్ సురేష్‌పై పిడి గుద్దులు గుద్ది, సెల్‌ఫోన్‌ను పట్టుకుపోయారని వివరించారు. విధుల్లో ఉన్న పాత్రికేయునిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

జనసేనవి నిరాధార ఆరోపణలు : వైసిపి

ప్రజాశక్తి -పిఎం పాలెం : భీమిలి నియోజకవర్గం పరిధిలో వైసిపి నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని జనసేన నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలను వైసిపి నాయకులు ఖండించారు. జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం పాలెంలోని వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వైసిపి నాయకులు మాట్లాడుతూ, ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముందుగా పవన్ కల్యాణ్ తన స్టాండ్ చెప్పాలని, ఎక్కడి నుంచి పోటీ చేస్తారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి వద్ద పీఏగా పనిచేసిన చందర్రావు పార్టీ మారగానే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏగా ఉన్న సమయంలో చందర్రావు అనేక భూ అక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టిపై చేస్తున్న అసత్య ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, నాయకులు గాదె రోశిరెడ్డి, పోతిన యల్లాజీ, పోతిన ప్రసాద్, సియ్యాద్రి కనకరాజు, రాయిన సాయి, కొండపల్లి వరలక్ష్మి, షేక్ జహనర, జామి శివ పాల్గొన్నారు.

ఎయులో ఆయుర్వేద వైద్య సేవలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆయుర్వేదాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం కృషిచేస్తోందని యోగా కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఒఎస్‌ఆర్‌యు భానుకుమార్ తెలిపారు. గత డిసెంబర్ 12వ తేదీ నుంచి ఈ సేవలు ఎయు యోగా విలేజ్‌లో అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పదంగా వివాహిత మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : వివాహిత యువతి అనుమానాస్పదంగా తన నివాసంలో మృతి చెందిన సంఘటన మండలంలోని చౌడువాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చౌడువాడ గ్రామానికి చెందిన దొడ్డి వాణి (30) బుధవారం రాత్రి భోజనాలు ముగించుకుని తన ఇంటి మేడపై తల్లి ఆకుల వరలక్ష్మితో కలిసి పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో వాణి తన కాళ్లకు నొప్పి వస్తుందని తల్లితో చెప్పి కింద ఉన్న తన బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది. ఉదయం తల్లి లేచి చూసేసరికి వాణి మంచంపై మృతి చెంది ఉంది. వాణి శరీరాన్ని పరిశీలిస్తే చిన్నచిన్న గాయాలు, మెడపై పెద్ద గాయం కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్ సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా వాణి భర్త నూకరాజు లారీ డ్రైవర్. తను బుధవారం డ్యూటీలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాణికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

స్ఫూర్తి ప్రదాత గౌతు లచ్చన్న

ప్రజాశక్తి -ఆనందపురం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్ఫూర్తి ప్రధాత స్వతంత్ర సమరయోధులు సర్దార్ గౌత లచ్చన్న అని వక్తలు కొనియాడారు. జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆనందపురం24 కాలనీలో లచ్చన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాల రాజ్యాధికార సాధనకు అలుపెరగని పోరాటం చేశారన్నారు. శ్రీకాకుళం నుంచి కన్యాకుమారి వరకు ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన నాయకుడు అన్నారు. జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి, జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా గీత కార్మిక రాష్ట్ర నాయకులను ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము, యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడితబోయిన రాములప్పుడు, టేక్‌పూడి నర్సింగరావు, కొల్లి ఈశ్వర్‌ప్రసాద్, చిట్టిబోయిన రాము, ముడసల శ్రీను, ముడసల కార్తీక్, ఇమంది శ్రీనివాసరావు, కుప్ప శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. గొట్టిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గండిబోయిన సత్యం బుత్తల ఆదినారాయణ, రాజేష్, అప్పలరాజు, అప్పారావు, మారయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఆరిలోవ, భీమునిపట్నం : విమ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మత్తులో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆపరేషన్ జోన్ -3 ఎఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భీమునిపట్నం : 4వ వార్డు పరిధి జెవి అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎఇ శేఖరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

31న భెల్ గుర్తింపు సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ గాజువాక యూనిట్‌లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. 18వ తేదీన ఓటర్ల జాబితాను ప్రవేశపెడతామని, 23వ తేదీన ఓటర్ లిస్ట్ ఫైనలైజ్ చేస్తామని పేర్కొన్నారు. 25వ తేదీన నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూట్నీ, 31న ఎన్నిక ఉంటుందని తెలిపారు. 31వ తేదీన సాయంత్రం ఐదు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.



బావిలో గంభూషియా చేపలను విడిచిపెడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు, జివిఎంసి అధికారులు

బావులలో 'గంభూషియా' చేపలు విడుదల

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 62వ వార్డులో డెంగీ, మలేరియా దోమలు వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా అచ్చెంనాయుడులోవలోని నేల బావులలో గురువారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ద్వారా మలేరియా విభాగం అధికారులు 'గంభూషియా' చేపలను విడుదల చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మాట్లాడుతూ, వర్షాకాల సీజన్ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, మలేరియా విభాగం హెల్త్ సూపర్‌వైజర్ బి.సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, సూపర్ వైజర్ దుల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన గంధం వెంకటరావు

జనసేనలో చేరిన గంధం వెంకటరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకకు చెందిన గంధం వెంకటరావు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో గురువారం సాయంత్రం జనసేన పార్టీలో చేరారు. బీసీ రోడ్డుకు చెందిన వెంకటరావు గత 30 సంవత్సరాలుగా స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టియుసి యూనియన్ అధ్యక్షులుగా పనిచేశారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కెకె.రాజు తదితరులు

43, 55 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 43, 55 వార్డుల పరిధి అబీద్‌నగర్-2, రెడ్డి తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వరకాలనీ ప్రాంతాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 55వ వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళ, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వార్డు అధ్యక్షులు కెపి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, రాయుడు శ్రీనివాసరావు, కాయిత వెంకటలక్ష్మి, అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాలు గడిచినా..

పరిష్కారానికి నోచని పంచ గ్రామాల సమస్య

ప్రజాశక్తి-పెందుర్తి : దశాబ్దాలు గడుస్తున్నాయి... పాలకులు వస్తున్నారు.. పోతున్నారు... అధికార పార్టీలు మారుతున్నాయి... కానీ పంచగ్రామాల ప్రజల సమస్య మాత్రం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న మాదిరిగా ఉంది. వేపగుంట, పురుషోత్తపురం, సింహాచలం, అడవివరం, వెంకటాపురం గ్రామాల ప్రజలను సుమారు రెండు దశాబ్దాల పైబడి పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులకు ఇదొక అవకాశవాద రాజకీయమైంది. ఆ సమయంలో మాత్రమే ప్రజా ప్రతినిధులు పంచగ్రామాల సమస్యను తెరపైకి తెస్తారు. తెగ హామీలిస్తారు. గెలిచిన తర్వాత ప్రజలకు ముఖం చాటేస్తున్నారు. దీనికి అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ మినహాయింపుకాదు.

పంచ గ్రామాల్లో ప్రజలకు భూములు, స్థలాలు ఉన్నా వాటిని అమ్ముకునేందుకు కానీ, వాటిలో ఏమైనా నిర్మాణాలు చేయడానికి కానీ పనికిరాని పరిస్థితి దాపురించింది. కుటుంబాలు పెద్దవై పూర్వం నిర్మించుకున్న చిన్న ఇళ్లు వారి నివాసానికి సరిపోకపోయినా అందులోనే ఇరకాల్సిన దుస్థితిని పాలకులు తెచ్చారు. వర్షాలకు ఇళ్లు కారిపోతున్నా కనీసం మరమ్మతులు చేసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో పంచ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పంచగ్రామాల సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణాలకు అవకాశం ఇవ్వకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న స్థలాలు



నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోవడంతో మధ్యలో పనులు నిలిచి పిచ్చిమొక్కలతో నిండిన భవనం

భూమిని చూసుకోవడమే...

పంచ గ్రామాల భూ సమస్య గత 20 సంవత్సరాలుగా పైబడి నలుగుతుంది. అప్పట్నుంచి మా భూమిని చూసుకోవడమే తప్ప అమ్ముకోవాలన్నా, అక్కడ ఇల్లు నిర్మించాలన్నా ఏ విధమైన అర్హత లేకుండా చేశారు. పిల్లల పెళ్లిళ్లుచేశాం. వారికి ఇల్లు నిర్మించి ఇద్దామన్నా అవకాశం ఇవ్వడంలేదు. అన్ని ప్రభుత్వాలు హామీ ఇస్తున్నాయే తప్ప అమలు చేయడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొంతమందితో కమిటీ వేసి సమస్యను పరిష్కరిస్తున్నట్లు మాకు ఆశ కల్పించారు. అది అడియాశగానే మిగిలింది. మేము బ్రతికుండగా సమస్యకు పరిష్కారం లభిస్తుందా, లేదా అన్న అనుమానం కలుగుతుంది. ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయడానికి కూడా చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.



దార్ల వెంకటరమణ, రవినగర్, నాయుడుతోట

ఇల్లు శిథిలావస్థకు చేరింది

కృష్ణానగర్లో మేము నివాసముంటున్నాం. మా తాతముత్తాతల నుంచి వచ్చిన ఆస్తి ఈ ఇల్లు. ఇది శిథిలావస్థకు చేరి పాములు కూడా చేరుతున్నాయి. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి స్లాబ్ వేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరినా స్పందనలేదు. ఇల్లంతా పడిపోతోంది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో బతుకుతున్నాం.

రాజు, కృష్ణానగర్

భెల్ గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టియుసి, సిఐటియు ఫ్రంట్‌ను గెలిపించండి

ప్రజాశక్తి -గాజువాక : భెల్ కంపెనీలో ఈ నెల 31వ తేదీన జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టియుసి, సిఐటియు కూటమిని గెలిపించాలని భెల్ హైదరాబాద్ యూనిట్ ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి కోరారు. భెల్ గాజువాక యూనిట్‌లో గురువారం ఏర్పాటుచేసిన సభలో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ, కంపెనీ రక్షణ, కార్మిక హక్కుల కోసం పోరాడుతున్న ఈ ఫ్రంట్‌ను గెలిపిస్తే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. యాజమాన్యంతో పోట్లాడి కార్మికులు గతంలో కోల్పోయిన హక్కులను తిరిగి సాధిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ, గుర్తింపు కాలంలో కార్మికుల కోసం పోరాడి సాధించిన సదుపాయాల గురించి వివరించారు. ఫ్రంట్‌ను గెలిపిస్తే మరిన్ని హక్కులు సాధిస్తామన్నారు. యూనియన్ అధ్యక్షునిగా పోటీ చేస్తున్న జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు, యాజమాన్యంతో పోట్లాడి కోల్పోయిన హక్కులు తిరిగి సాధిస్తామన్నారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షులు వి.ఆనందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిఎన్.మూర్తి, కె.విజయ్‌కుమార్, చిట్టిబాబు, పి.ఆనంద్‌కుమార్, సీతన్ననాయుడు, ఎస్ జగన్నాథరావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

వైసిపి సచివాలయ కన్వీనర్లకు బీమా

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి సచివాలయ కన్వీనర్లకు పార్టీ తరుపున బీమా సౌకర్యం కల్పిస్తూ అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణమండపంలో ఆదివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, సచివాలయ కన్వీనర్లకు పార్టీ తరుపున బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఆనంద్ కుమార్

ప్రజాశక్తి-యంత్రాంగం

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. గణపతినగర్ కూడలి నుంచి సాయి గణేష్ మెడికల్ షాప్ వరకు రూ.4 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు, డ్రైనేజ్ పనులకు, చంద్రనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించే డ్రైన్లు, సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అనంతరం జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసిపి నాయకులు అయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు, రైతు సంఘాల నాయకులతో కలిసి కొత్తపాలెం ప్రాంతంలో ముంపునకు గురవుతున్న ప్రాంతాలను, పంట పొలాలను, కాలువలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాడి భాస్కరరావు, బూరెల అప్పలనాయుడు. నమ్మి శ్రీను, సోషల్ మీడియా కో కన్వీనర్ స్పందన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు పరిధిలో రూ.2 కోట్ల 37 లక్షల 94 వేలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు సమక్షంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గురువారం శంకుస్థాపన చేశారు. రామచంద్రనగర్, అబీద్ నగర్ ప్రాంతాల్లో ఎస్‌డబ్ల్యు డ్రైన్లు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, వార్డుల్లో అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి రూ.185 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఇఇ శ్రీనివాస్, ఎఇ రమణమ్మ, గంట్ల శ్రీనుబాబు, బాణాల తరుణ్, కాయల రామారావు, రెడ్డి సీతారాం, రామారావు, పి.గోపి, మహదాశ్య గోపి, బసీర్, దుర్గ, వెంకటరమణ పాల్గొన్నారు.

కలెక్టర్, ఎన్‌జిటి ప్రతినిధుల అప్రకటిత పర్యటనలో ఆంతర్యం ఏంటి ?

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

నాతవరం మండలం సరుగుడు పంచాయితీ బమిడికలొద్దు లేటరైట్ తవ్వకాల ప్రాంతాల్లో బుధవారం జిల్లా కలెక్టర్, ఎన్‌జిటి ప్రతినిధి, ఇతర శాఖల అధికార్లు ముందస్తు ప్రకటన లేకుండా, ఆ ప్రాంత ప్రజలకు తెలియజేయకుండా రహస్యంగా పర్యటించాల్సిన అవసరం ఏముందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించింది. బమిడికలొద్దు లేటరైట్ తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో కేసు వేయడం జరిగిందని తెలిపారు. దీంతో సరుగుడు ప్రాంతానికి వెళ్ళి అక్కడ జరిగిన తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఎన్‌జిటి ఉత్తర్వులు జారీ చేసిందని, అందులో భాగంగానే మూడు నెలల క్రితం ఎన్‌జిటి ప్రతినిధి, జిల్లా అధికార యంత్రాంగం పర్యటించాల్సి వుందని పేర్కొన్నారు. కాని ఆ పర్యటన అర్ధాంతరంగా వాయిదా వేశారన్నారు. బుధవారం ఎవరికీ తెలియకుండా రహస్య పర్యటనలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మైనింగ్ మాఫియా ప్రభుత్వాన్నే ప్రభావితం చేస్తుదన్న అనుమానాలు వున్నాయని, పర్యావరణానికి, గిరిజన ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్‌జిటిలో కేసు వేసిన వారిని కూడా భాగస్వామ్యం చేయలేదని, ఈ పర్యటనంతా లేటరైట్ తవ్వకాలు నిర్వహిస్తున్న వారికి ఉపయోగపడే విధంగా వుందని స్థానికులు అనేక అనుమానులు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉందన్నారు. పారదర్శకమైన విచారణ చేపట్టాలని లోకనాథం డిమాండ్ చేశారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

స్కేటింగ్ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లిలో యూనిక్ రోలర్ స్కేటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 7వ అంతర్ యూనిక్ రోలర్ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బంగారు పతకాలు 5, వెండి పతకాలు 11, కాంస్య పతకాలు 8 సాధించారు. విజేతలను పాఠశాలలో గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంద, అకాడమీ ఇన్‌ఛార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు బిఎల్‌ఎలను నియమించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని జిల్లా ఓటర్ల ఎన్రోల్మెంట్ అధికారి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రూపొందిస్తున్న ఓటర్ల జాబితా స్వచ్ఛంగా, వేగంగా పూర్తయ్యేందుకే ప్రతివారం సమీక్ష చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా కి సంబంధించి పూర్తి సమాచారం జిల్లా అధికారిక వెబ్ సైట్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు ఏమైనా సందేహాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావచ్చున్నారు. ఇప్పటివరకు 890 మంది రెండు చోట్ల నమోదయినట్లు గుర్తించామని, 1709 వేరొక చోటకి వెళ్లినట్లు, 9460 మంది మరణించినట్లు గుర్తించగా 23,376 మంది వివరాలు సరిదిద్దవలసి ఉందని గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ అనిత, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం, ఎస్డీసీలు ప్రమీల గాంధీ, అనిత, జ్ఞానవేణి, రామలక్ష్మి, గొర్లి సూరిబాబు(వైసిపి), బొలిశెట్టి శ్రీనివాసరావు (టిడిపి), గంట శ్రీరామ్, ఆర్ శంకర్‌రావు (సిపిఎం), చదరం నాగేశ్వరరావు (బిజెపి), కొణతాల హరినాథ్ బాబు (ఆప్), ఏ సెక్షన్ సూపరెంట్ లక్ష్మీదేవి, డిటి రవికుమార్ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త వైద్యానికి పైలా ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని లంకవానిపాలెం గ్రామానికి చెందిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు లెక్కల దేముడుబాబు అనారోగ్యంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు గురువారం ఆయన్ను పరామర్శించారు. దేముడుబాబు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడంనాయుడు, కొరుపోలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేముడుబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పైలా ప్రసాదరావు

సుజల స్రవంతి పనులను వేగవంతం చేయాలి

రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సుజల స్రవంతి పనులు మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్ నాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 1876 ఎకరాల భూమిలో 1205 ఎకరాలు జిరాయితీ భూమి ఉందన్నారు. అనకాపల్లి, కసింకోట, సబ్బవరం మండలాల పరిధిలో మొత్తం 22 గ్రామాలకు చెందిన భూమిని సమీకరించాలని సూచించారు. ఆరిపాక నల్లరేగు పాలెం, కొండుపాలెంలలో వెంటనే పనిని ప్రారంభించాలన్నారు. జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి మాట్లాడుతూ సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొత్తం భూమిలో 1025 ఎకరాలు జిరాయితీ, 476 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగిలింది అటవీ భూమిగా గుర్తించడం జరిగిందని తెలిపారు. సేకరించిన భూమిలో పనులు వేగంగా చేయాలని, మిగిలిన భూమిని సేకరించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, సుజల స్రవంతి ప్రత్యేక ఉప కలెక్టర్ కె.రమామణి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐకి 'పోలీసు మెడల్ ఫర్ గ్యాలంటరీ' అవార్డు



ఎస్ఐ పాపినాయుడు, ముత్యాల నానికి మెడల్ ఇస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - యలమంచిలి : 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అరుదైన 'పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ' అవార్డును యలమంచిలి ఎస్ఐ కెల్ల పాపినాయుడు అందుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విశేష సేవలందించే వారికి మాత్రమే ఇటువంటి అవార్డు ఇవ్వడం జరుగుతుందని పోలీసు వర్గాలు తెలిపాయి. 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ అవార్డును ముఖ్యమంత్రి జనన్మోహన్‌రెడ్డి చేతులు మీదుగా అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు పాపినాయుడు విలేకర్లకు తెలిపారు. ఈ అవార్డు అందుకున్న వారికి నెలకు రూ.2వేలు అదనపు వేతనం, విమాన ప్రయాణాల్లో 75శాతం రాయితీ, ఫస్ట్‌క్లాస్ రైలు ప్రయాణం ఉచితం, ఇన్‌కం ట్యాక్స్ మినిహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

అచ్యుతాపురం : మండలంలో ఎం.జగన్నాథపురం గ్రామానికి చెందిన ముత్యాల నాని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. నాని పోలీస్ గ్రాండ్స్‌లో పనిచేస్తున్నారు. ఆయన పనితీరు ప్రశంసించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నానిని అభినందించారు.

వర్షాభావ పరిస్థితులపై స్పందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి వేసిన వరి నార్లు, ఉడుపులు పగుళ్లు వేసి ఆకుమడులు చనిపోయే పరిస్థితి ఉన్న నేపథ్యంలో నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. వర్షాభావ పరిస్థితులు వారం రోజులు కొనసాగితే అనకాపల్లి జిల్లా రైతాంగం అపార నష్టానికి గురవుతారని, ముఖ్యంగా కౌలు రైతులు తేరుకోలేని దెబ్బతింటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ మెట్ట ప్రాంతాల్లో నాట్లు పడలేదని, వేసిన ఆకుమడులు పనికిరాకుండా పోతున్నాయని, బోర్లు ఆధారంగా పంటలు రక్షించుకుందామంటే విద్యుత్ కోతలతో వ్యవసాయదారులకు గుండె కోతగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రత్యామ్నాయ పంటలకు రైతులకు సూచనలు సలహాలు ఇచ్చి ఈ పంట కాలం నష్టపోకుండా అవసరమైన విత్తనాలు పెట్టుబడులు ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులుగాని, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం గాని రైతాంగ పరిస్థితులను పట్టించుకోకుండా రాజకీయాల కోసం ఒకరిపై మరొకరు బురద జల్లుకుంటూ కాలం గడిపేస్తున్నారని విమర్శించారు.



ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన దిలీప్‌కుమార్

ఎపిఐడబ్ల్యుఎ చైర్మన్‌గా దిలీప్ కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌కు రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ ఇన్లాండ్ వాటర్ వేస్ చైర్మన్ పదవికి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు విడుదల అయినట్టు చైర్మన్ దిలీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్‌గా దంతులూరి దిలీప్ కుమార్ నియమితులైన సందర్భంగా వైసిపి పార్టీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి నాయకులు ఆడారి సూరిబాబు మృతి



ఆడారి సూరిబాబు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆడారి సూరిబాబు గురువారం మృతి చెందారు. సూరిబాబు సిడిసి చైర్మన్‌గా, టిడిపి మండల అధ్యక్షులుగా పలు పదవులు చేపట్టి విలువలు కలిగిన నాయకుడిగా ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలో పలు పార్టీలకు చెందిన నాయకులు సూరిబాబు భౌతికకయానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు పైల జగన్నాథరావు సూరిబాబు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అక్టోబర్ నెలలో జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబరు 2 నుండి 8వ తేదీ వరకు నిర్వహించే వివిధ ఆటల పోటీలలో ఎక్కువ సంఖ్యలో యువతీ యువకులు పాల్గొనేటట్లు చూడాలని సూచించారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జరిగే ఈ పోటీలలో 5 అంచెలు ఉంటాయన్నారు. క్రికెట్, వాలీబాల్, కబాడీ, కోకో, బ్యాడ్మింటన్ మొదలైన ఆటలు, యోగా, టెన్నికాయిట్, మారథాన్‌తో పాటు ఆయా ప్రాంతాలలో ఉండే సాంప్రదాయ ఆటలను కూడా చేర్చవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరాం, డిపిఒ శిరీష రాణి, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, పౌర సరఫరాల అధికారి వివిఎల్ఎన్ మూర్తి, క్రీడా శాఖ చీఫ్ కోచ్ ఎల్వి.రమణ పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్ లక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సుంకర లక్ష్మిని గురువారం టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శాలువ మెమోంటోతో ఘనంగా సత్కరించి అభినందించారు. గ్రామ సర్పంచ్ సుంకర సూరిబాబు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో గ్రామస్తులంతా పార్టీలకతీతంగా సూరిబాబు సతీమణి లక్ష్మిని సర్పంచ్‌గా ఏకగ్రీవం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ తన భర్త సూరిబాబు ఆశయ సాధనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దొంకిన అప్పలనాయుడు, టిడిపి నేత సాయం శేషు పాల్గొన్నారు.



సర్పంచ్ లక్ష్మిని సత్కరిస్తున్న టిడిపి నేతలు తాతయ్యబాబు తదితరులు



కూచిపూడి నాట్య ప్రదర్శన ఇస్తున్న ప్రసన్న

కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న ప్రసన్న

ప్రజాశక్తి-పరవాడ : ఎపి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం శ్రీశైల భ్రమరాంబిక సమేత మల్లిఖార్జునస్వామి సన్నిధిలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పరవాడ మండలానికి చెందిన అందుకూరి ప్రసన్న తన ప్రతిభను చాటుకున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ టీమ్ తరపున 25 మంది ఇందులో పాల్గొనగా, వారిలో ప్రసన్న ఒకరు. పరవాడ మండలం వెన్నెలపాలెం జంక్షన్ వద్ద గల నవగ్రహ దేవాలయ అర్చకులు అందుకూరి విశ్వనాథ శాస్త్రి సతీమణి అయిన ప్రసన్న ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. టీం తరపున సభ్యులందరికీ బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా శాఖ కౌన్సిలర్ గేదెల సింహాద్రి అన్నారు. సెప్టెంబర్ 1న జరుగు చలో విజయవాడ పోస్టర్‌ను చోడవరం బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జె రమేష్, బి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల వ్యవసాయ శాఖ నిర్వహించబోయే పంట కోత ప్రయోగాలపై మండలంలోని ఎం.అలమండలో ఆర్‌బికె సిబ్బందికి మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై కాంతమ్మ అధ్వర్యంలో మండల సహాయ గణాంక అధికారి ఆర్.రజని కుమారి అవగాహన కల్పించారు. పంట కోత ప్రయోగాలు చేయడం ద్వారా రైతులకు పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్సు, పంట కోత ప్రయోగాలు ద్వారా రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ వెరిఫికేషన్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఓటర్ల వెరిఫికేషన్‌లో పారదర్శకంగా వ్యవహరించాలని ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రమీల గాంధీ అన్నారు. మండలంలో దిబ్బిడి గ్రామంలో 147, 148, పోలింగ్ స్టేషన్లో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వలసలు, గ్రామాల తరలిపోవడం తదితర అంశాలపై దృష్టి సారించి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పాఠశాలకు టేబుల్, కుర్చీల వితరణ

ప్రజాశక్తి- పరవాడ : మండలంలోని పెదముసిడివాడ సర్పంచ్ పల్లా అప్పారావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నక్కవానిపాలెం ఎలిమెంటరీ స్కూల్‌కి తన సొంత నిధులు రూ.10 వేలుతో ఆఫీస్ టేబుల్, కుర్చీలు అందజేశారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతిలో అత్యున్నత మార్పులు సాధించిన వారికి తమ సొంత నిధులతో రూ.10 వేలు ప్రోత్సాహకం అందజేశారు. అలాగే మాజీ ఎంపీటీసీ కలవలపల్లి గోవిందరాజు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ఇద్దరికీ రూ.2వేలు చొప్పున అందజేశారు. 26 మంది రిటైర్డ్ సైనికులను సత్కరించారు.

రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీ తుమ్మపాల వీధిలో సుమారు పది లక్షల రూపాయల పంచాయితీ నిధులతో సీసీ డ్రైనేజీ, రోడ్డు పనులను సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈ కుమార్ రాజా, ఉప సర్పంచ్ చదరం చిన్న, జిల్లా పరిషత్ హైస్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, భారతి అశోక్, వార్డు మెంబర్లు తర్ర సత్యారావు, జెర్రిపోతుల లక్ష్మి, రవ్వ లక్ష్మీ శ్రీను, పంచాయతీ సిబ్బంది ఈశ్వరరావు, ఉమ పాల్గొన్నారు.

మట్టి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం పంచాయతీ పరిధిలోని పాయికారి కల్లాల వద్ద పైలా ఎర్రిబాబు కల్లం నుండి పైల దేముడు కల్లం వరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఆధ్వర్యాన సుమారు రూ.3 లక్షలతో మట్టి రోడ్డు నిర్మాణం పనులు గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ పైల రతాల సన్యాసిరావు, గంగు నాయుడు, పైల సన్యాసిరావు, పైలా అప్పారావు, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం అచ్యుతాపురం డివిజన్ కమిటీ కన్వీనర్ ఆర్ రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ అచ్యుతాపురం నుండి అనకాపల్లి వెళ్లే ప్రధాన రహదారి శిథిలమైన పలు ప్రమాదాలు సంభవించి ప్రజలు మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రహదారి విస్తరణ వల నిర్వాసితులుగా మారుతున్న వారికి వెంటనే నష్టపరిహారం అందజేసి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్ఈజెడ్ నిర్వాసితులకు బకాయిపడిన ప్యాకేజీ, మేజర్ సన్స్‌కు ఇళ్ల స్థలాలు అందజేయాలని, నిర్వాసితులకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పూడిమడక జెట్టీ నిర్మించాలని, స్థానిక పిహెచ్‌సిని 30 పడకలతో సిహెచ్‌సిగా మార్చాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేయాలని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక పరిశ్రమలలో ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, ఎస్.రామునాయుడు, బి.రామ్‌కుమార్, కె.సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి : బూడి



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి : నియోజకవర్గంలో పరిధిలోని నాలుగు మండలాలలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. దేవరాపల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన గురువారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బూడి మాట్లాడుతూ టిడిపి హయాంలో చేతకాక వదిలేసిన పనులన్నీ తమ ప్రభుత్వం పూర్తి చేసుకొస్తుందని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాలలో సైతం అనేక మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వం మళ్లీ వస్తే జన్మభూమి కమిటీల ద్వారా దోచుకోవడానికి తహతహలాడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటీసిలు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కర్రి సత్యం, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు ఏర్పడతాయని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి చిన్మయ దేవి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ముఖ్యంగా తల్లీ బిడ్డల ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. బాల్య వివాహాలు నిరోధించేందుకు ఐసిడిఎస్‌తో పాటు, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సహకారం అవసరమన్నారు. బాల్యవివాహాల నియంత్రణకు గ్రామ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి, సిడిపివోలు మేరీ సువార్త, మంగతాయారు, ఉషారాణి, టి శశికళ, లలిత కుమారి, శ్రీగౌరీ, ఇందిరా దేవి, ప్రభావతి, శ్రీవిద్య పాల్గొన్నారు.

అనకాపల్లి : బాల్య వివాహాల నియంత్రణకు అన్ని శాఖల సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం బాల్యవివాహాల నియంత్రణపై మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల వచ్చే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు ఐసిడిఎస్, పోలీస్, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి విజయభాస్కర్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్, ఆర్డిఓ చిన్ని కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, ఐసిడిఎస్ పిఓలు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రభుత్వం కల్పించే రాయితీలు, తోడ్పాటును వారికి అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం తరపున అందించే ఇన్సెంటివ్‌లు మంజూరు కొరకు సబ్ కమిటీని ఏర్పాటు చేసి నివేదికను సమర్పించాలని సూచించారు. ఏపీఐఐసీలో పరవాడ వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు విషయమై అధికారులు పారిశ్రామికవేత్తలు విన్నవించగా కలెక్టర్ ఏపీఈపీడీసిఎల్ సిఎండితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. గత సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు గూర్చి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ మెంబర్ నదియా, ఏపీఐఐసీ జెడ్ ఎం.త్రినాథ్, డిపిఓ శిరీష రాణి, డిఆర్‌డిఏ పీడీ లక్ష్మీపతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఇ, అగ్నిమాపక శాఖ అధికారి, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి

అనకాపల్లి : జిల్లాలోని కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడే విధంగా ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డివిఈఓ, జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల పైన పట్టు సాధించేలా బోధన ఉండాలని సూచించారు. తెలివైన, ఉత్సాహవంతులైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యా ప్రమాణాలు తగ్గడానికి గల కారణాలను విశ్లేషించుకుని తదనుగుణంగా బోధన అంశాలను రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి సుజాత కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



స్కాలర్ షిప్‌లు అందజేసిన కెనరా బ్యాంకు అధికారులు

విద్యార్థులకు కెనరా బ్యాంకు స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు కెనరా బ్యాంక్ (మామిడివాడ బ్రాంచ్) వారు కెనరా విద్యా జ్యోతి స్కీమ్ ద్వారా స్కాలర్ షిప్‌లు అందజేశారు. ఈ స్కీమ్‌లో 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు రూ.2500, 8వ తరగతుల నుంచి 10వ తరగతి వరకు రూ.5000 చొప్పున అందించినట్లు బ్రాంచ్ మేనేజర్ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు 2 రోజులు అంతరాయం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలి పురపాలక సంఘం పరిధిలోని 4 నుండి 19 వార్డులు, 25వ వార్డులో శుక్ర, శనివారాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీకి మంచినీటి సరఫరాకు ప్రధాన వనరులైన సోమదేవుపల్లి హెడ్ వాటర్ వర్క్స్ నుండి మంచినీటిని సరఫరా చేసే పంపింగ్ మెయిన్ పైప్ లైన్ మరమ్మతుకు గురైనందున ఈ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అయితే ఈ వార్డుల్లో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

సమస్యలపై పిఎసిఎస్ ఉద్యోగుల వినతి


ప్రజాశక్తి-దేవరాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాడుగుల నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు గురువారం మండలంలోని తారువలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కలిసిన వినతి పత్రం అందజేశారు. గతంలో విడుదల చేసిన 36, 90 జిఒలు ఇంతవరకు అధికారులు అమలు చేయలేదని, దీర్ఘకాలిక సమస్యలైన హెచ్‌ఆర్ పాలసీ జరగలేదని తెలిపారు. 2019 వేతన సవరణలను అమలు చేయాలని కోరారు. దీనికి ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్రావు, లక్ష్మణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మామిడిపాలెం గ్రామంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి అనితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మురళి, కాండ్రేగుల చందు మాట్లాడుతూ సర్వే నంబర్ 145లో 10 ఎకరాల భూమిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం కేటాయించగా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం 10 ఎకరాలను కాస్త 5 ఎకరాలకు తగ్గించిందని తెలిపారు. ఇప్పుడు జగనన్న ఇళ్ల కోసం ఆ పది ఎకరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో ఆ ఆలోచనలు విరమించుకుని, అక్కడ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోకేష్, మొల్లేటి గంగాధర్, పెదపాటి శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవన వికాసంపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో చదువుచున్న పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు మానవ జీవన వికాసానికి అవసరమైన శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపవతి పర్యవేక్షణలో, గురుకులం ప్రిన్సిపల్ కె.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషన్ స్పీకర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. యోగా ద్వారా మేధాశక్తిని పెంపొందించుకొని జీవిత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ అధికారిగా విశాఖ జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు తీసుకున్న ఎస్.రూపవతిని, హెల్త్ సూపర్ వైజర్ కర్రి కన్నంనాయుడును సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

వేతనాల పెంపుపై హర్షం



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వెలుగు సిబ్బంది

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సెర్ప్, ఐకెపి సిబ్బందికి వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సెర్ప్, ఎఫ్‌టిఇ ఉద్యోగులకు బేసిక్‌పై 23శాతం పెంచడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ కె.సత్యనారాయణ ఏపిఎం పార్వతీభాయి, కె. చినబాబు గొలుగొండ, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం మండలాల సిసిలు పాల్గొన్నారు.

19న ఫొటో ప్రదర్శన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఈ నెల 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బాల గాయకుడు సూపర్ సింగర్ పాడుతా తీయగా విన్నర్ దొంతంశెట్టి ధీరజ్ ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం ధీరజ్ తండ్రి రాజేష్ వెల్లడించారు. స్థానిక శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఈనెల 19,20 తేదీల్లో 10గంటల. నుండి రాత్రి 8గంటల వరకు ఫోటో ప్రదర్శ ఉంటుందనానరు. ప్రదర్శనలో ప్రకృతి, పక్షులు, సామాజిక జీవనంపై విభిన్న ఫొటోలను ప్రదర్శనలో ఉంచుతామన్నారు. ధీరజ్ చదువుతోపాటు ఎన్నో రియాల్టీ షోలలో పాడుతూ. చిత్రకళలోనూ ఫోటోగ్రఫీలోనూ మెలుకువలు నేర్చుకుని, ఫోటోగ్రఫీలో ఎన్నో అవార్డులు పొందాడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల అనిత సన్యాసిపాత్రుడు, ఆర్‌డిఒ సిహెచ్ జయరాం, డిఎఫ్ఒఅనంత శంకర్ పాల్గొంటారని, ఈ ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ జయప్రదం చేయాలని కోరారు.

స్థల వివాదంలో కొట్లాట

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఇరువురు స్థల వివాదంలో జరిగిన గొడవ కొట్లాటకు దారితీసింది. వివరాలివి. కవగుంట గ్రామానికి చెందిన సారిక రాము, సారిక శివ పెదనాన్న చిన్నాన్న కుమారులు. వీరిరువురు రోడ్డు పక్కనే ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే, అక్కడున్న రెండు సెంట్లు గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించుకునే విషయమై వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో సారిక శివ బంధువులను కవగుంట గ్రామానికి రప్పించి శివ, శివ మామ అప్పారావు, బావమరిది ప్రసాదు, మేనల్లుడు తెగడ రమేష్ నలుగురు కలిసి మద్యంమత్తులో సారిక రాము ఇల్లు చుట్టుముట్టి, రామును బయటికి లాక్కొచ్చి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాము నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ : కెవి బలిఘట్టం 132/33 కెవి సబ్‌స్టేషన్ నుంచి గొలుగొండ, కెడిపేట 33/11 కెవి సబ్‌స్టేషన్లకు వచ్చే విద్యుత్ లైన్ల కిందన్ను చెట్ల కొమ్మలను తొలగించటం, ఇతర నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ నెల 18న ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ నర్సీపట్నం ఇఇ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

గొలుగొండ, కెడిపేట, చోద్యం, లింగంపేట, కొత్త మల్లంపేట, అమ్మపేట, జోగుంపేట, పాలికమల్లవరం, శ్రీరామపురం, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, యర్రవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ దీక్ష విరమించం!

ప్రజాశక్తి -కోటవురట్ల : తమ గ్రామానికి పాఠశాల, రహదారి, ఇతర మౌలిక వసతుల కల్పనకు గిరిజనులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా 42వ రోజు గురువారం గిరిజనులు వినూత్నంగా విల్లంబులు చేబూని, ఆకులు వస్త్రాలుగా ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గిరిజనుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చే వరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు అప్పలరాజు, మండల నాయకులు డేవిడ్‌రాజు, అర్జున్, రాంబాబు నర్సింగరావు, సురేష్ పాల్గొన్నారు.

అణుకు గిరిజనుల వినూత్న నిరసన



బాణాలతో నిరసన చేపడుతున్న అణుకు గిరిజనులు

మినీ గోకులం షెడ్‌ల బిల్లులు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న పాడిరైతులు

ప్రజాశక్తి -కోటవురట్ల: గత టిడిపి ప్రభుత్వ హయాంలో పాడి రైతులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్‌లకు బిల్లులు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. పశువుల షెడ్డుల నిర్మాణానికి రైతు వాటా పది శాతం చెల్లించి మినీ గోకులం పేరుతో నిర్మాణాలు చేపట్టినా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని వాపోయారు. మండలంలో మినీ గోకులం షెడ్‌లను నిర్మించిన రైతులకు చెల్లించాల్సిన బిల్లులను రైతులకు కాకుండా సాయి బాలాజీ కంపెనీ పేరుతో ు దారి మళ్లించారని రైతులు ఆందోళన చెందుతున్నారు, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెట్ల నరేష్, శ్రీనివాసరావు తదితర పాడి రైతులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ మిషన్లు వెనక్కి...

ప్రజాశక్తి -కోటవురట్ల :ఉమ్మడి విశాఖ జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ టెక్నాలజీ మిషన్లను గురువారం అనకాపల్లి జిల్లా డిపిఎం పి శ్రీనివాస్‌కు సరెండర్ చేశారు, ఈ సందర్భంగా పి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉమ్మడి విశాఖ డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో మండలంలో ఫ్యాషన్ టెక్నాలజీకి 82 కుట్టుమిషన్లు ఏర్పాటు చేశారని, వాటిని అనకాపల్లి జిల్లాకు స్వాధీనం చేసినట్లు తెలిపారు, జిల్లా అధికారుల ఆదేశాలతో ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న మిషన్లతో త్వరలో ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రంఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చినరమణ, చేయూత డిపిఎం సిహెచ్ వరప్రసాద్, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



ఫ్యాషన్ టెక్నాలజీ మిషన్లు స్వాధీనం చేసుకుంటున్న డిపిఎం

విత్తన మొలక శాతం పరీక్ష అవసరం

ప్రజాశక్తి- మాడుగుల : వరిలో విత్తన మొలక శాతం పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి ఎం వాసుదేవరావు అన్నారు. గురువారం కింతలి వల్లాపురంలో పొలం బడి నిర్వహించారు. 85 శాతం మొలక వచ్చినపుడు మాత్రమే నారు పోయాలని రైతులకు సూచించారు. విత్తన శుద్ధి చేసి నారు వేస్తే, పైర్లకు తెగుళ్ళ ఆశించవన్నారు. ఉదయం 10గంటల లోపు, మధ్యాహ్నం 3గంటల తరువాత మాత్రం పురుగుల మందు పిచికారీ చేయాలని, మోకానికి మాస్క్ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది కల్యాణ్‌కుమార్, సతీష్, స్థానిక నాయకులు తాలపు రెడ్డి రాము పాల్గొన్నారు.

చీడిగుమ్మల ఉపసర్పంచ్ రాజీనామా ఉపసంహరణ

ప్రజాశక్తి-గొలుగొండ : తాను చేసిన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నానని చీడిగుమ్మల పంచాయతీ ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. గురువారం జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పార్టీలో విభేదాలతోనే రాజీనామా చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు.కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నల్లబెల్లి శ్రీనివాసరావు, చీడిగుమ్మల ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్ర



తీర్థయాత్రకు వెళ్లే బస్ ప్రారంభిస్తున్న ఎంవిఆర్ ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-మాడుగుల: అనకాపల్లికి చెందిన వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఆధ్వర్యంలో ఉచిత తీర్థయాత్రలు కొనసాగుతున్నాయి.

గురువారం కొండయ్యపాలేనికి చెందిన భక్తులను అన్నవరం, సింహాచలం, కనకమహాలక్ష్మి ఆలయాల దర్శనాలకు తీసుకెళ్లారు. భక్తులకు అల్పాహారం, భోజనాలు, తాగునీటి సదుపాయాలను ఎంవిఆర్ ట్రస్ట్ ద్వారా అందించనున్నారు. తిరిగి భక్తులను వారి గ్రామాల్లో దించేలా తీర్థయాత్ర నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంవిఆర్ పిఎ సతీష్ కుమార్, ఎంవిఆర్ యువసేన జిల్లా సభ్యులు పాల్గొన్నారు

ఉప ఎన్నికలు జరిగే కేంద్రాల్లో 19న సెలవు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : డివిజన్ పరిధిలో కొన్ని పంచాయతీలకు ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలు, కౌంటింగ్ జరిగే కేంద్రాలకు ఈనెల 19న సెలవును ప్రకటించిందని డిఎల్‌పిఒ ఎస్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ జరిగే కేంద్రాలకు మాత్రమే ఈ సెలవు వర్తిస్తుందన్నారు. రాంబిల్లి మండలం కొప్పు గుండుపాలెం, కొమరపల్లి అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం, మోసయ్యపేట, హరిపాలెం నర్సీపట్నం మండలం మెట్టపాలెం, గొలుగొండ మండలం గాదంపాలెం, సిహెచ్ నాగాపురం నక్కపల్లి మండలం చిన్నదొడ్డిగల్లు, రేబాక, ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెం, చిన్న గుమ్ములూరు, గుడివాడ, కొరుప్రోలులో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. పాయకరావుపేట శ్రీరాంపురం రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామాలలో ఎన్నికలు ఉన్నాయని, రాంబిల్లి మండలం కొప్పుగొండ పాలెం 9, 10 వార్డులకు నామినేషన్లు వేయలేదని తెలిపారు. ఎస్ రాయవరం మండలం కొరుపోలు సర్పంచ్ స్థానానికి తప్ప మిగతా అన్ని గ్రామాలలోనూ వార్డు మెంబర్లకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు.

విద్యా వాలంటీర్ పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రోలుగుంట :మండలంలోని ఆర్ల పంచాయతీ శివారు పిత్రిగెడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఎస్‌టిసి పాఠశాలలో విద్యావాలంటీర్ పోస్టుకు అర్హులైన గిరిజన అభ్యర్థులు నుంచి ఈ నెల 19లోగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ జగ్గారావు తెలిపారు. ఇంటర్ కనీస విద్యార్హత కాగా, ఉన్నత చదువులు చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గౌరవ వేతనం రూ.10వేలుగా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు, మరిడిమాంబ అమ్మవారి జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో 15 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేతకు రూ.పది వేలు, రన్నరప్‌కు రూ.ఎనిమిది వేలు నగదు బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, కాళ్ళ సత్యనారాయణ, అడిగర్ల చిన్నబ్బాయి, సింగంపల్లి జోగినాయుడు, గొల్లు శివ పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్



శిథిలమై ప్రమాదభరితంగా ఉన్న బస్‌షెల్టర్

ప్రజాశక్తి-రోలుగుంట :మండలంలో నిండుగొండ సెంటర్ వద్ద ఉన్న బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిండుగొండ గ్రామస్తులు, పరిసర ప్రాంతాల్లో ఉన్న వారు నర్సీపట్నం వెళ్లాలంటే ఈ సెంటర్‌లో ఆగాలి. ఎండావానల్లో ఈ షెల్టరునే ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా నూతన బస్ షెల్టర్‌ను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఠా కార్మికుల ప్రయోజనం కోసం సమగ్ర చట్టాన్ని తేవాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం విశాఖ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సేవలు ద్వారా ప్రభుత్వ ఆదాయంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ముఠా కార్మికులు పట్టించు కోకపోవడం శోచనీయమన్నారు. యూనియన్ గౌరవా ధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ కేరళ తరహాలో సమగ్ర చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో టి.పైడిరాజు, రెడ్డి, శ్రీనివాసు, వెంకట్రావు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు కె.నర్సింగరావు, హోటల్ వర్కర్స్ యూనియన్ నేత ఎర్రిబాబు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అనకాపల్లి: ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ అనకాపల్లి ముఠా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి గాంధీ సెంటర్లో గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ గోదాములలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు వయసు మళ్లిన తర్వాత ఆదరించే పరిస్థితిలు లేవన్నారు.కార్యక్రమంలో సంఘం నాయకులు బిసెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, సురేష్, యు.రాజు, కళ్యాణం పాల్గొన్నారు.



అనకాపల్లి గాంధీ సెంటర్‌లో ముఠా కార్మికుల నిరసన



నర్సీపట్నం గాంధీ సెంటర్ వద్ద ఆందోళన

నర్సీపట్నం టౌన్ : ముఠా కార్మికుల చట్టాలు సమగ్రంగా అమలు కానందువల్లే వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు విమర్శించారు. గురువారం జిసిసి బంకు వద్ద సమస్యల పరిష్కారానికి ముఠాకార్మికులు ఆందోళన చేపట్టారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ముఠా కార్మికులకు ఏ చట్టం అమలు చేయడం లేదన్నారు. వారికి పని భద్రత, గుర్తింపు కార్డులు, పిఎఫ్ ,ఇఎస్ఐ పింఛనుతో కూడిన సమగ్ర చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి,ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి,ముఠా కార్మిక సంఘం నాయకులు ఎం.రమణ,అర్జున్,నానాజీ,రాజు,నాయుడు పాల్గొన్నారు

సికింద్రాబాద్-విశాఖ మధ్య వన్ వే ప్రత్యేక రైలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య అదనపు రద్దీ దృష్ట్యా ఈ నెల 18న సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 7055 సికింద్రాబాద్-విశాఖపట్నం వన్ వే ప్రత్యేక రైలు శుక్రవారం రాత్రి 9.00 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఈ రైలు సికింద్రాబాద్, విశాఖపట్నం స్టేషన్ల మధ్య జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, కొండపల్లి, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

సర్పంచ్ ఉపఎన్నికల్లో విస్తృత ప్రచారం



జోరుగా ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిత

ప్రజాశక్తి -యస్ రాయవరం : మండలంలోని కొరుప్రోలు సర్పంచ్ ఉపఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.కొరుప్రోలు గ్రామంతోపాటు కాలనీల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసిపి ప్రభుత్వ పాలనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించడంతోపాటు, జగన్ పాలనలో అభివృద్ధికి నోచుకోక రాష్ట్రం ఎంతగా అధోగతి పాలైందో ప్రజలకు తెలియజెప్పుతున్నారు. మరలా పూర్వ వైభవం రావాలంటే టిడిపిబలపరచిన అభ్యర్థి కర్రి సూర్యవేణిని గెలిపించాలని కోరారు. రానున్న మార్పునకు ఇదే సంకేతం కావాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు ప్రత్తిపాటి పెదసత్తిబాబు, కోరా రామారావు, కొరపాటి గోపాలం, మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నల్లపరాజు వెంకటరాజు, కొప్పిశెట్టి వెంకటేష్ గుర్రం రామకృష్ణ, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

కుంచం రమణమ్మకు ఘన నివాళి



రమణమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేత లోకనాథం, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయడమే కుంచం రమణమ్మకు నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. గురువారం పార్టీ మద్దిపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో కుంచం రమణమ్మ తృతీయ వర్ధంతి సభ సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రమణమ్మ, సుబ్బారావు దంపతులు పార్టీ సభ్యులుగా ఉంటూ పార్టీ, ప్రజా సంఘాలు ఇచ్చే పిలుపులను శివాజీపాలెంలో అమలు చేసేవారన్నారు. క్రమశిక్షణతో, పార్టీ విలువలకు కట్టుబడి పనిచేసేవారన్నారు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ ఇద్దరు ఆడపిల్లలకు, అబ్బాయికీ కులాంతర వివాహాలు జరిపి ఆదర్శంగా నిలిచారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేసే భారాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సమసమాజం రావాలని నిరంతరం పాటుపడ్డారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత రమణమ్మ చిత్రపటానికి లోకనాథం పూలమాలవేసి నివాళర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, నాయకులు కె.కుమారి, బేగం, పీతల అప్పారావు, జివిఎన్.చలపతి, అనపర్తి అప్పారావు, త్రినాద్, విసిసి ప్రతినిధి ఎన్.ధనలక్ష్మి, రమణమ్మ కుమారుడు రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా అశోక్ లేలాండ్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అశోక్ లేలాండ్ ప్లాటినం జూబ్లీ వేడుకలను నగరంలోని లక్ష్మీ మోటార్స్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి ప్రదర్శనలు, ఇతర వినోద భరిత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకలకు హాజరైన 300 కస్టమర్లను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం లక్కీ డ్రా నిర్వహించి 15 మంది ఖాతాదారులకు శాలువా, ప్రత్యేక బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా సంస్థ సిఇఒ శ్రీనివాసరావు, జిఎం కృష్ణ మాట్లాడుతూ అశోక్ లేలాండ్ వాహన విశిష్టతలను తెలియజేశారు. జిఎం.కృష్ణ మాట్లాడుతూ కార్యక్రమంలో కస్టమర్స్ నుంచి స్పాట్ 15 బుకింగ్స్ అందుకున్నామని, వారందరికీ 50 గ్రాముల వెండిని బహుమతిగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అశోక్ లేలాండ్ ఆర్ఎం కిరణ్, ఎఎస్ఎం నాసిర్, ఎసిఎస్ఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'శ్రీప్రకాష్' 47వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -పాయకరావుపేట : స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 18, 19 తేదీలలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల వివిధ శాఖలో విద్యార్థులకు 'గాతా రహే మేరా దిల్' పేరిట పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు.

ఈనెల 19వ తేదీన ఉదయం రక్తదాన శిబిరం, సాయంత్రం ముగింపు వేడుక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హంగేరి నుంచి ప్రముఖ షవనాజ్ విద్వాంసులు, బలాజ్స్ విరాగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అంతర్జాతీయ యోగా గురువు వబ్బులరెడ్డి దుర్గా ప్రసాద్‌ను సన్మానించనున్నట్లు తెలిపారు.

నేడు హెల్త్ సెక్రటరీల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల (ఎఎన్ఎంలు, గ్రేడ్ 3) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిహెచ్.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మణిపూర్ అకృత్యాలపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మణిపూర్‌లో మారణ హోమానికి ఆర్ఎస్ఎస్, బిజెపినే కారణమని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. గురువారం సాయంత్రం రాంనగర్ బజార్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలను ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కె.నర్సింగరావు, ఎం.సుబ్బారావు, ఎర్రి బాబు, కె.సంతోష్, చంద్రమౌళి పాల్గొన్నారు.



రాంనగర్ బజారులో కొవ్వొత్తుల ప్రదర్శన

సిపిఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి



అనకాపల్లిలో బస్‌యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నరేంద్ర మోడీ, జగన్మోహన్ రెడ్డిల దుర్మార్గపు పాలన నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని రక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు.నర్సీపట్నం బ్యాంక్ కాలనీ అపార్ట్‌మెంట్ వద్ద సిపిఐ బస్‌యాత్ర ప్రచార జాతా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి జగన్ ఇద్దరూ పోటాపోటీగా బ్రిటిషర్లను తలదన్నే పాలనతో రాష్ట్రాన్ని, ఇక్కడ సంపదను ప్రైవేటు బడాబాబులకు కట్టబెట్టడానికి చూస్తున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొట్టికి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, నల్లవెల్లి శ్రీరామమూర్తి, శ్రీరంగ రాంబాబు, సత్తిబాబు పాల్గొన్నారు

గొలుగొండ : జగన్, మోడీల నుండి విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను, దేశ,రాష్ట్ర

పలుచోట్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

సంపదను కాపాడాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అన్నారు. గురువారంపాతూరు బస్‌స్టాండ్ వద్ద సిపిఐ ప్రచార జాతా-బస్సు యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్, మోడీల దొంగ నాటకాలతో, ప్రజా వ్యతిరేక విధానాల ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారన్నారు రైతు సంఘం జిల్లా నాయకులు మేకా సత్యనారాయణ, మండల కార్యదర్శి మేకా భాస్కర్‌రావు, సత్తిబాబు ఎస్.వాసుదేవరావు, గల్లా సన్యాసిరావు, పెంటకోట అప్పారావు, మేకా బాబూరావు, గల్లా గౌరీ,అప్పారావు, సత్తిబాబు, పాల్గొన్నారు.

అనకాపల్లి : రాష్ట్రాన్ని కాపాడండి, దేశాన్ని రక్షించండి అనే నినాదంతో సిపిఐ ఈ నెల 17 నుండి సెప్టెంబరు 8వ తేదీ వరకు తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బస్సు యాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈనెల 19న అనకాపల్లి యాత్ర చేరుకుని ఉదయం 10 గంటలకు న్యూ కాలనీలోని రోటరీ కళ్యాణ మండపంలో సుజల స్రవంతి నిర్మాణంలో జాప్యంపై సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు రాజాన దొరబాబు, కె.సన్యాసిరావు, వైఎన్ భద్రం, మత్తుర్తి సూరిబాబు, వియ్యపు రాజు, సత్య నారాయణ, కోన లక్ష్మణ, ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.